## ● స్కందమాతగా ఏడుపాయల దుర్గమ్మ



దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా భవానీమాత స్కంద మాత (మహాలక్ష్మి) అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. - పాపన్నపేట

# నిమ్స్‌లో ఇక దంత వైద్యం

- నేటి నుంచి అందుబాటులోకి సేవలు

హైదరాబాద్ సిటీబ్యూరో/ఖైరతాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖానగా ప్రత్యేక గుర్తింపు పొందిన నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో శుక్రవారం నుంచి దంత వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. నూతనంగా ఏర్పాటుచేసిన దంత వైద్య విభాగాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప గురువారం ప్రారంభించారు. ఈ విభాగం ద్వారా కన్సల్టేషన్‌తోపాటు దంతాలను శుభ్రం చేయడం, పుచ్చు పళ్లను తొలగించడం, రూట్‌కెనాల్, క్యాపింగ్ తదితర సేవలను అందించనున్నట్టు అధికారులు తెలిపారు. దీనిని స్పెషాలిటీ బ్లాక్, గ్రౌండ్ ఫ్లోర్, రూమ్‌నంబర్ 11లో ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. ఈ డెంటల్ క్లినిక్ ఓపీ సేవలు ప్రతిరోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీభాస్కర్, డాక్టర్ కృష్ణారెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ సాయిసతీశ్, డాక్టర్ సాయిబాబా, దంత వైద్యులు డాక్టర్ మహ్మద్ ఖ్వాజా మొయినుద్దీన్, ఏపీఆర్వో ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.



గురువారం నిమ్స్‌లో దంత వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

# జాగృతి ఆస్ట్రేలియా అధ్యక్షుడిగా శ్రీకర్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): భారత జాగృతి ఆస్ట్రేలియా అధ్యక్షుడిగా శ్రీకర్‌రెడ్డి అందెం నియమితులయ్యారు. గురువారం భారత జాగృతి ఆస్ట్రేలియా ఎగ్జిక్యూటివ్ కమిటీని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. అధ్యక్షుడిగా శ్రీకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తన్వి గోయల్, అరుణ్‌కుమార్ వెనుకంటి, కార్యదర్శిగా అంజనీ సుంకిశాల, సహాయ కార్యదర్శులుగా మన్‌ప్రీత్ సింగ్, రామకృష్ణ, ట్రెజరర్‌గా స్వాతి ధనగిరి, కల్చరర్ కోఆర్డినేటర్‌గా బాలు తానాజీ, యూత్ కోఆర్డినేటర్‌గా విరించి యక్కంటి, స్టూడెంట్ కోఆర్డినేటర్‌గా ఆశ్రిత్ కోరబోయిన నియమితులయ్యారు. అదేవిధంగా ఐదుగురిని ఆస్ట్రేలియా స్టేట్ కోఆర్డినేటర్లను నియమించారు. యాక్ట్ కోఆర్డినేటర్‌గా మంజూష బల్మూరి, క్వీన్స్‌లాండ్ కోఆర్డినేటర్‌గా ప్రీతమ్ కృష్ణ, సౌత్ ఆస్ట్రేలియా కోఆర్డినేటర్‌గా వెంకట్ లింగపల్లి, విక్టోరియా కో ఆర్డినేటర్‌గా గౌరవ్ రాహి, వెస్టర్న్ ఆస్ట్రేలియా కో ఆర్డినేటర్‌గా సతీశ్ వడ్డేపల్లి నియమితులయ్యారు.

# 'వెలిగొండ' విస్తరణను అడ్డుకోండి

- ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా కొత్తగా 2 ఎత్తిపోతలకు అనుమతులు
- కేఆర్‌ఎంబీకి తెలంగాణ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): వెలిగొండ ప్రాజెక్టుకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఎలాంటి నీటి కేటాయింపులు లేకపోయినా కృష్ణా జలాలను అక్రమంగా పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం దానిని నిర్మించడమే గాకుండా, ప్రస్తుతం మరింతగా విస్తరిస్తున్నదని తెలంగాణ ప్రభుత్వం మండిపడింది. వెంటనే వెలిగొండ ప్రాజెక్టు విస్తరణ పనులను అడ్డుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య మండలిని (కేఆర్‌ఎంబీ) కోరింది. ఈ మేరకు కేఆర్‌ఎంబీ చైర్మన్‌కు తెలంగాణ రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖల ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్ గురువారం లేఖను రాశారు. వెలిగొండ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరాలను బోర్డు దృష్టికి తీసుకెళ్లారు. కృష్ణా మిగులు జలాలపై ఏపీ ప్రభుత్వానికి బచావత్ ట్రిబ్యునల్ ఎలాంటి హక్కులనూ ఇవ్వలేదని, కేవలం వినియోగించుకునే స్వేచ్ఛను ఇచ్చిందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టంచేసింది.

### కేంద్రం ఆదేశాలు ఏపీ బుట్టదాఖలు

ఏపీ ప్రభుత్వం ఇప్పటికీ అక్రమంగా అనేక ప్రాజెక్టులను నిర్మిస్తూ శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను బేసిన్ అవతలికి మళ్లిస్తున్నదని తెలంగాణ రాష్ట్రం మండిపడింది. ఇదే విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు కేంద్ర మంత్రి షెకావత్ దృష్టికి తీసుకెళ్లారని, ఏపీ తీరును అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో గట్టిగా వ్యతిరేకించారని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో అనుమతుల్లేకుండా ఎలాంటి ప్రాజెక్టులను చేపట్టవద్దని కేంద్రం సైతం ఏపీకి ఆదేశాలు జారీ చేసిందని లేఖలో స్పష్టంచేసింది. అయినప్పటికీ ఏపీ కొత్తగా వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం అర్ధవీడు మండలంలో రెండు ఎత్తిపోతలను రూ.51.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు ఏపీ అనుమతులు మంజూరు చేసిందని ధ్వజమెత్తింది. కేఆర్‌ఎంబీ వెంటనే స్పందించి వెలిగొండ ప్రాజెక్టుతోపాటు దానికి అనుబంధంగా చేపడుతున్న ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని తెలంగాణ ఆ లేఖలో డిమాండ్ చేసింది.

## రేపటి నుంచి పోలీస్ సంస్మరణ వారోత్సవాలు

- ఈ నెల 31 వరకు వివిధ కార్యక్రమాలు
- విస్తృతంగా పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు: డీజీపీ

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ఈ నెల 21 నుంచి 31 వరకు రాష్ట్రంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించనున్నట్టు డీజీపీ అంజనీకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వారోత్సవాల్లో పెద్ద ఎత్తున పౌరులు పాల్గొనేలా చొరవ తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ 10 రోజుల్లో ప్రతీ స్టేషన్‌లో ఓపెన్ హౌజ్‌తోపాటు పోలీస్ సేవలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, వివిధ స్థాయిలోని పోలీస్ అధికారులకు కూడా వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. సీనియర్ పోలీస్ అధికారులు, పోలీస్ అమరుల ఇండ్లను సందర్శించి వారి బాగోగులు తెలుసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో పోలీసింగ్ అంశంపై ఫొటోగ్రఫీ, స్వల్ప నిడివిగల వీడియోగ్రఫీ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలూ నిర్వహించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో 21న పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# సీఎం దృష్టికి జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు!

## కొత్త, పాత సొసైటీల్లోని సభ్యులందరికీ ఒకేసారి కేటాయించేలా చర్యలు: హరీశ్



హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. ఇటీవల ఏర్పాటైన 'ది తెలంగాణ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ' ప్రతినిధులతో గురువారం ఆయన ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యత్వ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసారి కూడా అధికారం తమదేనని, మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు కాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని తొలి ప్రాధాన్యంగా తీసుకుంటామని మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. కొత్త, పాత సొసైటీల్లోని సభ్యులందరికీ కలిపి ఒకేసారి ఇండ్ల స్థలాలను కేటాయించే దిశలో తాను, మంత్రి కేటీఆర్ కలిసి సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతామని చెప్పారు. జిల్లాల్లో ఇప్పటికే మెజారిటీ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించామని గుర్తుచేశారు. అదే క్రమంలో హైదరాబాద్‌లోని జర్నలిస్టులకు సైతం ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోర్టు కేసుల కారణంగా జర్నలిస్టుల ఇండ్ల సమస్యను పరిష్కరించడం ఆలస్యమైందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కోర్టు కేసు పరిష్కారం కోసం ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. సుప్రీంకోర్టులో అడ్వకేట్‌ను పెట్టి, ప్రభుత్వం తరఫున అఫిడవిట్ వేసి, తీర్పు జర్నలిస్టులకు అనుకూలంగా వచ్చేలా సహకరించామని పేర్కొన్నారు.



హైదరాబాద్ ఎన్‌ఎండీసీ ప్రధాన కార్యాలయంలో సీవీసీ కార్యదర్శి డేనియల్‌తో అధికారులు

# ఎన్‌ఎండీసీని సందర్శించిన సీవీసీ కార్యదర్శి

హైదరాబాద్, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2023 కార్యక్రమాల్లో భాగంగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) కార్యదర్శి డేనియల్ బుధవారం హైదరాబాద్‌లోని జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండీసీ) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్‌ఎండీసీ సీఎండీ (అదనపు బాధ్యతలు) అమితవ ముఖర్జీ, కార్యదర్శి బీ విశ్వంతహ్ సహా ఇతర అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'అవినీతికి నో చెప్పండి - దేశంపట్ల నిబద్ధతను కలిగి ఉండండి' అనే నినాదంతో ఈ ఏడాది విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2023ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.


TELANGANA STATE POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD - 500 082

ADDENDUM TO NOTIFICATIONS DT.04.10.2023 FOR DIRECT RECRUITMENT TO THE POSTS OF ASSISTANT ENGINEERS & CHEMISTS

The last date for submission of applications through "On-line"; EDIT Option and the date of written examination scheduled earlier for the posts of Assistant Engineers (Electrical, Mechanical, Electronics & Civil) and Chemists are extended/postponed. The candidates are requested to visit the TSGENCO website www.tsgenco.co.in for the rescheduled dates.

Place: Hyderabad
Date: 20.10.2023

Sd/- D. PRABHAKAR RAO
Chairman and Managing Director







